సాక్షి
నల్లగొండ
బుధవారం, 23, అక్టోబర్, 2024



సవాళ్లను స్వీకరించాలి

విద్యార్థులు సవాళ్లు స్వీకరించి, పరిష్కార మార్గాలు అన్వేషించాలని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు.

- 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటిమట్టం :	590 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం	: 588.80 అడుగులు
ఇన్‌ఫ్లో	: 71,361 క్యూసెక్కులు
క్రస్ట్‌గేట్లు	: 15,948 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	: 29,557 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	: 8,279 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	: 8,117 క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	: 2,400
వరద కాల్వకు	: 400

మూసీ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం :	645 అడుగులు
ప్రస్తుత నీటి మట్టం :	643.85 అడుగులు
ఇన్‌ఫ్లో	: 1227క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	: 1077 క్యూసెక్కులు
ఎడమకాల్వకు	: 48 క్యూసెక్కులు
కుడికాల్వకు	: నిల్

న్యూస్‌రీల్

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులకు దరఖాస్తులు

నల్లగొండ టౌన్ : జిల్లాలోని గుర్తింపు పొందిన ప్రభుత్వ, గ్రాంట్ ఇన్ ఎయిడెడ్ ప్రైవేట్ శిక్షణ సంస్థల్లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎంపీహెచ్‌డబ్ల్యూ/ఏఎన్‌ఎం శిక్షణ కోసం రెండు సంవత్సరాల కోర్సులో ప్రవేశానికి అర్హత గల అభ్యర్థినుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లాలోని శిక్షణ సంస్థల వివరాల కోసం ఆరోగ్య సంస్థ కార్యాలయంలో సంప్రదించాలని.. పూర్తి వివరాలను chfw.telangana.gov.in వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

డీఈఓ విచారణ



వివరాలు తెలుసుకుంటున్న డీఈఓ భిక్షపతి

చండూరు : చండూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం తమను వేధిస్తున్నాడని మధ్యాహ్నం భోజన కార్మికులు చేసిన ఫిర్యాదు మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి మంగళవారం పాఠశాలలో విచారణ చేపట్టారు. మహిళలను, సంబంధిత హెచ్‌ఎంను వివరణ అడిగి తెలుసుకున్నారు. వారంలోగా త్రీమెన్ కమిటీ ద్వారా ఏజెన్సీ నియామకంపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ తోకల వెంకన్న ఉన్నారు.

టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడిగా నారాయణయాదవ్



నల్లగొండ టౌన్ : తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ పెడరేషన్ (టీయూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడిగా వంగూరు నారాయణయాదవ్, ప్రధాన కార్యదర్శిగా ఎస్.వెంకటేశ్వర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం యాదవ భవన్‌లో జరిగిన జిల్లా సమావేశంలో వారు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏల్లో కనీసం మూడు డీఏలను విడుదల చేయాలని పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కోట మల్లయ్య, సిరందాసు రాందాస్, బానాల రాంరెడ్డి, ఎల్లయ్య, కృష్ణయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, సురేష్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్‌కుమార్

చింతపల్లి : మండలంలోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి పాల్వాయి శ్రావణ్‌కుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు పరిశీలించారు. పాస్ మిషన్‌లో డీలర్లు తప్పకుండా ఎరువుల విక్రయాన్ని నమోదు చేయాలని సూచించారు. నాణ్యతలేని ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎరువుల దుకాణాల్లో ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. ఆయన వెంట ఏఓ పోలిశెట్టి శ్రావణకుమారి ఉన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం శ్రీఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం 1001 తమలపాకులతో సహస్ర నామార్చన, ఆకు పూజ జరిపించారు. ఇక ప్రధానాలయంలో నిత్య పూజలు సంప్రదాయంగా కొనసాగించారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, సాయంత్రం వెండి జోడు సేవ నిర్వహించారు.

వర్షం.. తడిసిన ధాన్యం



మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి నల్లగొండ సమీపంలోని అర్జాలబావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల చుట్టూ నీరు చేరడంతో వర్షపు నీటిని తొలగించేందుకు ప్రయత్నిస్తున్న రైతు



వర్షానికి కొట్టుకుపోయిన ధాన్యాన్ని ఎత్తుతున్న రైతు

- నల్లగొండ రూరల్

విధిలేక.. వ్యాపారులకు!

8 నుంచి 12 శాతం తేమ ఉంటేనే కొంటామంటున్న సీసీఐ

- వర్షాలు, మంచు కారణంగా.. పత్తిలో పెరిగిన తేమ
- తేమ శాతం ఎక్కువగా ఉండడంతో 22 కేంద్రాల్లో ఎక్కడా కిలో కూడా కొనలే..
- ధరలో తేడాతో నష్టపోతున్న పత్తి రైతులు

నల్లగొండ అగ్రికల్చర్ : పత్తి రైతుకు మద్దతు ధర దక్కడం లేదు. పత్తిలో తేమ 8 నుంచి 12 శాతం వరకు ఉంటే మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఇవ్వనున్నట్లు జిల్లా యాత్రాంగం ప్రకటించింది. పత్తి కొనుగోలుకు వారం క్రితమే 22 కేంద్రాలను ఏర్పాటు చేసింది. కానీ, ప్రతి రోజు జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. వాటికి తోడు రాత్రి వేళ మంచు కారణంగా పత్తి పూర్తిగా తడిసి తేమ శాతం పెరుగుతోంది. పత్తిలో 20 నుంచి 35 శాతం వరకు తేమ ఉంటోంది. ఆ పత్తిని సీసీఐ కేంద్రాలను తీసుకుపోతే తేమశాతం ఎక్కువగా ఉందని నిరాకరిస్తున్నారు. ఆరబెట్టుకుని 12 శాతం వచ్చిన తరువాత తీసుకురావాలని కేంద్రాల నిర్వాహకులు తిప్పి పంపిస్తున్నారు. కానీ పత్తిని ఆరబెట్టే పరిస్థితి లేకపోవడంతో తేమ శాతం ఎక్కువ ఉన్న పత్తిని రైతులు విధిలేక వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 17 లక్షల క్వింటాళ్ల పత్తిని వ్యాపారులకు విక్రయించినట్లు వ్యవసాయ శాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. వాతావరణం మరో వారం పది రోజులు ఇలాగే ఉంటే పత్తి రైతులకు మద్దతు ధర అందని ద్రాక్షలా మారే ప్రమాదం ఉంది.

5.58 లక్షల ఎకరాల్లో పత్తిసాగు

జిల్లా వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో 5.58 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగుచేశారు. ఈ సీజన్‌లో అనువైన వర్షాలు కురవడంతో పత్తిచేలకు మేలు జరిగింది. 44.64 లక్షల క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉన్నట్లు జిల్లా యంత్రాంగం అంచనాలు వేసింది. ఇప్పటి మొదటి దశ పత్తితీత పూర్తయి.. రెండో దశ పత్తితీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. పత్తి కొనుగోలు కోసం రైతులకు ప్రభుత్వ మద్దతు ధరను అందించేందుకు జిల్లాలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) కేంద్రాలను ఏర్పాటు చేసింది. సీసీఐ కేంద్రాల ద్వారా ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఇవ్వనున్నట్లు జిల్లా యాత్రాంగం ప్రకటించింది.



తిప్పర్తి సమీపంలోని పత్తి కొనుగోలు కేంద్రం

వారం గడిచినా ఒక్క కిలో కొనలే..

జిల్లాలో సీసీఐ 22 జిన్నింగ్ మిల్లుల్లో పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వారం రోజులు గడుస్తోంది. నేటికీ ఒక్క కిలో కూడా కొనుగోలు చేయలేదు. చండూరు మార్కెట్ కమిటీ పరిధిలో 4, చిట్యాల పరిధిలో 2, వెంకటేశ్వరనగర్(మాల్) పరిధిలో 6, దేవరకొండ(మల్లేపల్లి) పరిధిలో 5, నకిరేకల్ పరిధిలో 2, నల్లగొండ పరిధిలో 2, శాలిగౌరారం పరిధిలో ఒకటి.. ఇలా జిల్లా యంత్రాంగం సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కొనుగోలుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకుని పత్తి కోసం ఎదురు చూస్తోంది. కానీ సీసీఐ నిబంధలన ప్రకారం 8 నుంచి 12 శాతంలోపు తేమ ఉన్న పత్తి కేంద్రాలకు రావడం లేదు.

పత్తి ఆరబెట్టే పరిస్థితి లేదు..

జిల్లా వ్యాప్తంగా 20 రోజులుగా జిల్లా అంతటా రోజు విడిచి రోజు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పత్తిలో తేమశాతం పెరుగుతోంది. వాతావరణంలో ఎండ పెద్దగా లేకపోవడంతో పత్తిని ఆరబెట్టుకునే అవకాశం లేకుండా పోయింది. తేమ ఎక్కువగా ఉన్న పత్తిని నిల్వ చేస్తే రంగుమారి పురుగువచ్చే అవకాశం ఉంటుంది. దీంతో చేసేది లేక గ్రామాల్లోనే విక్రయిస్తున్నారు. మద్దతు ధర క్వింటాకు రూ.7,521 ఉంటే.. వ్యాపారులు క్వింటాకు రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పెట్టిన పెట్టుబడులు కూడా రాక అప్పులపాలయ్యే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి కొనడానికి సీసీఐ సిద్ధంగా ఉంది

> పత్తిని కొనడానికి జిల్లా వ్యాప్తంగా 22 జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. 8 నుంచి 12లోపు తేమ శాతం ఉంటే ప్రభుత్వ మద్దతు ధర రూ.7521 చెల్లిస్తుంది. నిబంధనల ప్రకారం తేమ ఉన్న పత్తి ఇప్పటి వరకు కేంద్రాలకు రావడం లేదు. పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉంటుంది. ఆరబెట్టుకుని తీసుకురావాలని కేంద్రాల వారు సూచిస్తున్నారు.
>
> – ఛాయాదేవి, జిల్లా మార్కెటింగ్ అధికారి

12వ బెటాలియన్‌లో ఆరుగురిపై వేటు

పోలీస్ కుటుంబాల ఆందోళనపై సీరియస్

- సస్పెన్షన్ ఉత్తర్వులు నిరాకరించిన ఉద్యోగులు
- అందరి కుటుంబాలు ఆందోళన చేస్తే మాపైనే చర్యలు ఎందుకని ప్రశ్న
- కమాండెంట్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వరకు వాదనలు
- బెటాలియన్‌లో అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు

నల్లగొండ క్రైం : తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక పోలీస్ దళం (టీజీఎస్‌పీ) అన్నెపర్తి 12వ బెటాలియన్‌లో ఆరుగురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేస్తూ కమాండెంట్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. రికార్డు పర్మిషన్‌ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం అన్నెపర్తి బెటాలియన్ పోలీసు కుటుంబ సభ్యులు, బంధువులు అద్దంకి–నార్కట్‌పల్లి రహదారిపై రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనలో పాల్గొన్న వారి కుటుంబ సభ్యులను గుర్తించిన పోలీసులు ఆరుగురు సిబ్బందిపై వేటు వేశారు. ఈ ఆరుగురికి సస్పెన్షన్ ఉత్తర్వులను అందజేయగా వారు వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. 200 మందికిపైగా కానిస్టేబుళ్ల కుటుంబాలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తే మా ఆరుగురికి మాత్రమే ఎందుకు సస్పెన్షన్ ఉత్తర్వులు ఎందుకిస్తారని వారు కమాండెంట్‌ను ప్రశ్నించారు. దీనిపై కమాండెంట్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం వరకు వాదనలు జరిగాయి. సస్పెండ్ అయిన వారిలో కానిస్టేబుల్ నాగరాజు, సురేష్, అజీజ్, వినోద్, హెడ్‌కానిస్టేబుల్ రామకృష్ణ, నర్సింగ్‌నాయక్ ఉన్నట్లు తెలిసింది.



అన్నెపర్తిలోని 12వ బెటాలియన్

ఆందోళనలో పోలీస్ కుటుంబ సభ్యులు..

సస్పెన్షన్‌కు గురైన పోలీసుల కుటుంబాలకు చెందిన బంధువులు, వారి పిల్లలు ఆందోళన చెందుతున్నారు. అందరి బంధువులు, కుటుంబ సభ్యులు ఆందోళన చేస్తే కేవలం ఆరుగురిపైనే కక్షకట్టి సస్పెండ్ చేయడంలో ఆంతర్యమేంటని ప్రశ్నిస్తున్నారు. ఉన్నత స్థాయి అధికారుల నివాసాల్లో కానిస్టేబుల్ పనిచేయాలని చట్టం చెబుతుందా? బాలు అందించేందుకు, ఆవులు మేపేందుకు, ఇళ్లలో పని చేసేందుకు కానిస్టేబుళ్లను నియమించుకోవాలని చట్టంలో ఉందా అని పోలీసు కుటుంబ సభ్యులు ప్రశ్నిస్తున్నారు.

సిబ్బందితో అన్ని పనులు..

బెటాలియన్‌లో సిబ్బంది చేతే అన్ని పనులు చేయిస్తున్నారని తెలుస్తోంది. ఫైరింగ్ స్థలం నుంచి ట్రాక్టర్ ద్వారా మట్టి తెప్పించి రోడ్డుకు ఇరువైపులా పోయించడం, గోడల నిర్మాణాలు, భవనాలకు రంగులు కూడా సిబ్బంది చేతే చేయిస్తున్నారని సమాచారం. బెటాలియన్‌లో జరుగుతున్న అంశాలపై మీడియాకు సమాచారం ఇవ్వద్దని.. చెబితే ఇబ్బందులు తప్పవని అధికారులు బెదిరించినట్లు తెలిసింది. బెటాలియన్‌లో ర్యాంకు స్థాయి అధికారులు మూడేళ్ల పాటు మాత్రమే విధులు నిర్వహించాల్సి ఉండగా.. ఆరేళ్ల పాటు ఇక్కడే కొనసాగడంలో అంతర్యమేంటో తెలియడం లేదు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన అధికారులు కావడంతో వివక్షతగా వ్యవహరిస్తున్నారని సిబ్బంది అంటున్నారు.

విచారణ జరుగుతుంది

> సస్పెన్షన్ విషయమై విచారణ జరుగుతుంది. నిబంధనల ప్రకారం పోలీసు ఉద్యోగుల భార్యలు కూడా చట్టం పరిధిలోకి వస్తారు. సస్పెన్షన్ విషయమై విచారణ చేస్తున్నాం. బెటాలియన్‌కు వచ్చిన నిధుల విషయంలో ఎలాంటి అవకతవకలు జరగలేదు.
>
> – కమాండెంట్ సత్య శ్రీనివాసరావు

బెటాలియన్‌లో నిధుల గోల్‌మాల్..

మరోవైపు బెటాలియన్‌లో అనేక అక్రమాలు జరుగుతున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇటీవల పోలీసు శిక్షణ కోసం ప్రభుత్వం రూ.36 లక్షలు మంజూరు చేసిందని అందులో నిధులు గోల్‌మాల్ జరిగిందని.. పాత మంచాలను చూపి కొత్తగా తెచ్చినట్లు బిల్లులు పెట్టారని తెలిసింది. స్పోర్ట్స్ మీట్‌కు వచ్చిన రూ.9 లక్షలను ఓ ముఖ్య పట్టణం నుంచి తెప్పించి.. ప్రైవేట్ స్టోర్‌లో తెచ్చినట్లుగా బిల్లులు పెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. ఇదే స్పోర్ట్స్ మీట్ కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థుల నుంచి రూ.3 వేలు వసూలు చేసినట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో డ్యూటీ చేసినవారి ఖాతాల్లో డబ్బులు వేసి.. తిరిగి వారి నుంచి రూ.300 చొప్పున వసూలు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రోడ్డు ప్రమాదాలను నివారించాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ : రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా నివారించాలని కలెక్టర్ నారాయణరెడ్డి కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి రోడ్డు భద్రత సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాల వల్ల గుంతలు పడిన రహదారులను వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. రహదారుల మలుపుల వద్ద ముళ్లపొదలు, చెట్ల కొమ్మలను 15 రోజుల్లోగా తొలగించాలని ఆదేశించారు. జాతీయ రహదారులపై అనధికారిక రోడ్డు క్రాసింగ్‌లను మూసివేయాలని, రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే గ్రామాల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణకు షెడ్యూల్ తయారు చేయాలని సూచించారు. పోలీస్ కళాజాత ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ శరత్‌చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులతో అన్ని రహదారులపై తనిఖీ నిర్వహించి ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలను గుర్తించామన్నారు. ఆయా ప్రదేశాల్లో స్పీడ్ బ్రేకర్లు, లైట్లు, స్టాపర్లు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సమావేశంలో ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ సత్యనారాయణరెడ్డి, ఆర్డీఓ లావణ్య, పోలీసులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొనుగోలు కేంద్రాలన్నీ ప్రారంభించాలి

జిల్లాలో ప్రతిపాదించిన అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలన్నీ23వ తేదీ బుధవారం సాయంత్రంలోగా ప్రారంభం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. వానాకాలం ధాన్యం కొనుగోలుకు జిల్లాలో 375 కేంద్రాలు ప్రతిపాదించామన్నారు. 17 శాతంలోపు తేమ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని సూచించారు. వర్షానికి ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పత్తి కొనుగోలు కేంద్రాలను ఆర్డీఓలు, తహసీల్దారులు తనిఖీ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. సామాజిక, ఆర్థిక గణనలో భాగంగా గణకులు, పర్యవేక్షకులను గుర్తించాలన్నారు. ఉపాధ్యాయులను సోషియో ఎకనామిక్ సర్వే విధులకు తీసుకోవద్దని, అవసరమైతే 25 శాతం మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. మండల ప్రత్యేక అధికారులు సీజనల్ వ్యాధులు, పారిశుద్ధ్యం, మొక్కల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

వేములపల్లి : వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మంగళవారం ఆయన వేములపల్లి మండలంలో వర్షాలకు నేల కొరిగిన పంటలను పరిశీలించి మాట్లాడారు. వరి చేలు నేలవాలడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. మిల్లుల వద్దకు తెచ్చిన ధాన్యానికి మిల్లర్లు ఎలాంటి పేచీలు పెట్టకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు పాదూరి శశిధర్‌రెడ్డి, పాల్వాయి రాంరెడ్డి, రొండి శ్రీనివాస్, మాళోతు వినోద్, కందుల నాగిరెడ్డి, మద్దిరాల సత్యనారాయణరెడ్డి, కోడిరెక్క వెంకన్న, రెమడాల భిక్షం, శీలం చిన్నసైదులు, వల్లమల్ల ఎల్లయ్య, నరసింహారావు, పుట్టల సైదులు, సత్యనారాయణ రాధిక, సుకన్య, మట్టయ్య పాల్గొన్నారు.



నేలవాలిన పంట పొలాన్ని పరిశీలిస్తున్న జూలకంటి రంగారెడ్డి

ఆరుగురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

- బదిలీల్లో తప్పుడు స్పౌజ్ సర్టిఫికెట్లు పెట్టినట్లు నిర్ధారణ

నల్లగొండ : ఉపాధ్యాయ బదిలీల్లో తప్పుడు స్పౌజ్ ధ్రువపత్రాలు పెట్టి బదిలీ చేయించుకున్న ఆరుగురు ఉపాధాయులపై విద్యాశాఖ సస్పెన్షన్ వేటు వేసింది. కనగల్ మండలం ఎంపీపీఎస్ చర్లగౌరారంలో పనిచేసే జె.శ్రీనివాసులు, తిప్పర్తి మండలం బాలికల హైస్కూల్‌లో పనిచేసే ఎ.రజిత, చిట్యాల మండలం జెడ్పీహెచ్‌ఎస్ గుండ్రాంపల్లిలో పనిచేసే ఎ.వెంకట్‌రెడ్డి, నల్లగొండ మండలం దోమలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేసే పి.శ్రీనివాస్, మిర్యాలగూడ పట్టణంలోని బకల్‌వాడీ జెడ్పీహెచ్‌ఎస్‌లో పనిచేస్తున్న పి. స్వాతి, తిప్పర్తి మండలం కేశరాజుపల్లి జెడ్పీహెచ్‌ఎస్ హైస్కూల్‌లో పని చేస్తున్న జి.సులోచన బదిలీల సందర్భంగా స్పౌజ్ విషయంలో తప్పుడు ధ్రువపత్రాలు పెట్టి బదిలీ అయ్యారు. వీటిపై ఫిర్యాదులు రావడంతో విద్యాశాఖ విచారణ చేపట్టింది. వారివి తప్పుడు ధ్రువపత్రాలని నిర్ధారణ కావడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో భిక్షపతి ఉత్తర్వులు జారీ చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న బీసీ సంఘం నాయకులు

నల్లగొండ టౌన్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా విద్యార్థుల సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు రెండు సంవత్సరాల ఫీజు బకాయిలు విడుదల చేయడం లేదన్నారు. బీసీల జనాభా ప్రకారం గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని కోరారు. అదే విధంగా బీసీ డిగ్రీ కళాశాలలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ధర్నా చేస్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పగిడి జీడయ్యయాదవ్, పోలగోని వెంకటేష్, కర్నాటి యాదగిరి, నాగేశ్వర్‌రావు, రవికుమార్, సాయికుమార్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏడాదిన్నరగా.. ఎదురుచూపు

- రిటైర్డ్ ఉద్యోగులకు అందని బీమా సొమ్ము
- రూ.21 కోట్ల విలువ చేసే 704 చెక్కులు ఆర్థిక శాఖలో పెండింగ్
- సొమ్ము సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్న రిటైర్డ్ ఉద్యోగులు



నల్లగొండ : రిటైర్డ్ ఉద్యోగులకు బీమా సొమ్ము అందడం లేదు. ఏడాదిన్నరగా రూ.21 కోట్ల విలువ చేసే 704 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. రిటైర్డ్ అయిన వెంటనే బీమా సొమ్ము కోసం దరఖాస్తు పెట్టుకోగానే.. జిల్లా స్థాయిలో లెక్క చేసి చెక్కులు రాసి పంపుతున్నారు. అవి ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉంటున్నాయి. రిటైర్డ్ అయ్యాక వచ్చే డబ్బులతో హాయిగా కాలం గడుపుదామనుకున్న వారు.. రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా సంస్థ (టీజీఎల్ఐసీ) చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉద్యోగికి బీమా తప్పనిసరి..

ప్రభుత్వ ఉద్యోగం పొందిన వారు గతంలో సంవత్సరం తర్వాత కచ్చితంగా రాష్ట్ర ప్రభుత్వ జీవిత బీమా సంస్థలో వేతనాన్ని బట్టి ప్రీమియం చెల్లించాల్సి ఉండేది. ప్రస్తుతం ఉద్యోగం వచ్చిన మొదటి నెల నుంచే ఏ శాఖలో ఉద్యోగం పొందుతారో ఆ శాఖకు సంబంధించిన డ్రాయింగ్ ఆఫీసర్ ఆ ఉద్యోగి స్కేల్, వయస్సును బట్టి జీవిత బీమా సంస్థ నిర్ణయించిన స్లాబ్‌ల ప్రకారం నెల వారీగా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. 25 ఏళ్ల వయసులో ఉద్యోగం పొందితే ప్రతి నెల రూ.2 వేల ప్రీమియం చెల్లించాలి. దానికి ప్రభుత్వం కొంత మొత్తం జమ చేస్తుంది. ఆ మొత్తానికి 10 శాతం బోనస్ కలుపుతారు. 35 సంవత్సరాలు సర్వీస్‌లో ఉన్న ఉద్యోగి రిటైర్డ్ అయితే రూ.35 లక్షల వరకు వస్తాయి. ఆ ఉద్యోగి చనిపోయినా, వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్నా.. ఈ డబ్బులను వారి కుటుంబ సభ్యులు పొందే అవకాశం ఉంటుంది.

బీమా డబ్బుల కోసం ఎదురుచూపు..

రిటైర్డ్ అయిన తర్వాత వచ్చే డబ్బులతో పిల్లల వివాహాలు, ఇంటి నిర్మాణాలకు ఉపయోగించుకోవాలనే ఆలోచనతో ఉంటారు. మధ్యలో రుణాలు తీసుకునే అవకాశం ఉన్నా.. రిటైర్డ్ అయిన తర్వాత ఎక్కువ మొత్తం వస్తుందనే ఉద్దేశంతో చాలా మంది పొదుపు చేశారు. రిటైర్డ్ అయి ఏడాదిన్నర దాటినా బీమా డబ్బులు రాకపోవడంతో వారంతా తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకుని డబ్బులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రావాల్సిన మొత్తం ఇలా..

- 2023– 24 సంవత్సరంలో 441 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. ఆ చెక్కులకు సంబంధించి దాదాపు 500 మంది వరకు రిటైర్డ్ ఉద్యోగులకు రూ.10 కోట్ల వరకు రావాల్సి ఉంది.
- 2024–25 సంవత్సరానికి సంబంధించి 2024, అక్టోబరు వరకు 263 చెక్కులు పెండింగ్‌లో ఉన్నాయి. దాదాపు 300 మంది పైచిలుకు రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించి రూ.11 రావాల్సి ఉంది.

క్లుప్తంగా

బాలికను వేధించిన యువకుల అరెస్ట్ !

కోదాడరూరల్: బాలికను వేధింపులకు గురిచేసిన యువకులను కోదాడ రూరల్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. కోదాడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక ఈ నెల 12వ తేదీన పాఠశాలకు వెళ్తుండగా ముగ్గురు యువకులు ఆమెను అడ్డుకొని సెల్ ఫోన్‌లో వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పెడతామని ఆ ముగ్గురు యువకులతో పాటు మరో ముగ్గురు కలిసి బాలికను బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు వసూలు చేశారు. ఇంకా డబ్బులు ఇవ్వకపోతే వీడియో బయటపెడతామని బెదిరింపులకు పాల్పడుతుండడంతో సదరు బాలిక విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ముగ్గురు యువకులతో పాటు మరో ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోక్సో కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు బుధవారం వెల్లడించనున్నట్లు తెలిసింది.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మిర్యాలగూడ అర్బన్: ఆర్థిక ఇబ్బందులతో మద్యానికి బానిసైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్‌బోర్డు కాలనీలో గల ఎస్వీ కన్వెన్షన్‌లో మంగళవారం జరిగింది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. హౌజింగ్‌బోర్డు కాలనీలోని ఎస్వీ కన్వెన్షన్‌లో గత నాలుగేళ్లుగా జొన్నపాల ముత్తయ్య(45) వాచ్‌మెన్‌గా పనిచేస్తూ అక్కడే ఓ గదిలో భార్య లక్ష్మితో కలిసి ఉంటున్నాడు. అప్పులు ఎక్కువ కావడతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ముత్తయ్య మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

సూర్యాపేటటౌన్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థి మంగళవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. మేళ్లచెరువుకు చెందిన శివమణి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బీసీ కళాశాల హాస్టల్‌లో ఉంటూ డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం అర్ధరాత్రి హాస్టల్ నుంచి బయటకు వెళ్లిన శివమణి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కడుపునొప్పి భరించలేక ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడని శివమణి తండ్రి చెబుతున్నారు. ఆత్మహత్యాయత్నానికి గల అసలు కారణం తెలియాల్సి ఉంది.

గంజాయి, గంజాయి చాక్లెట్లు కాల్చివేత

భువనగిరి క్రైం: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ కేసుల్లో పట్టుబడ్డ గంజాయి, గంజాయి చాక్లెట్లు, హాష్ ఆయిల్‌ను భువనగిరి మండలం తుక్కాపురం సమీపంలోని రోమా ఇండస్ట్రీస్ నందు మంగళవారం ఎక్సైజ్ అధికారులు కాల్చివేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ డిస్పోజల్ కమిటీ ఉత్తర్వుల ప్రకారం 144 కిలోల గంజాయి, 4.5 కిలోల గంజాయి చాక్లెట్లు, 40 మి.లీ. హాష్ ఆయిల్‌ను కాల్చివేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ, భువనగిరి, సూర్యాపేట జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారులు బి. సంతోష్, సైదులు, లక్ష్మణ్ నాయక్, భువనగిరి ఎక్సైజ్ సీఐ నరేందర్, ఎక్సైజ్ సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

24న వ్యాసరచన పోటీలు

నల్లగొండ రూరల్: జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ఈ నెల 24న ఎంజీయూలో విద్యార్థులకు వక్తృత్వ, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంజీయూ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు.

సాగర్‌లో రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన

- ఏడాది లక్ష్యం.. మూడు నెలల్లోనే పూర్తి

నాగార్జునసాగర్: రెండు సంవత్సరాల తర్వాత భారీ వరదలు రావడంతో నాగార్జునసాగర్ జలాశయం పూర్తిస్థాయి జలకలను సంతరించుకుంది. రెండు నెలలుగా నిరంతరంగా వరదలు కొనసాగుతున్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టులో తెలంగాణ పరిధిలోని రెండు జల విద్యుదుత్పాదన కేంద్రాల ద్వారా రికార్డు స్థాయిలో విద్యుదుత్పాదన జరిగింది. కొద్దిరోజులు ఎడమకాల్వపై ఉన్న రెండు టర్బైన్లలో ఒకటి మొరాయించింది. అలాగే ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో రెండవ యూనిట్ గత రెండేళ్లుగా మరమ్మతులకు గురైంది. దీనిని మూడు రోజులుగా జపాన్ నుండి వచ్చిన సాంకేతిక నిపుణులు మరమ్మతులు చేస్తున్నారు. అయితే, చిన్నచిన్న సమస్యలను అధిగమించి జల విద్యుత్ ఉత్పత్తి భారీగా చేశారు. సంవత్సరంలో పూర్తి చేయాల్సిన లక్ష్యాన్ని గడిచిన మూడునెలల్లోనే చేరుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం(2024 ఏప్రిల్ నుంచి 2025 మార్చి వరకు)లో 1400 మిలియన్ యూనిట్లు ఉత్పాదన లక్ష్యం కాగా.. అక్టోబర్22 (మంగళవారం) సాయంత్రానికి లక్ష్యాన్ని చేరుకున్నారు. ప్రాజెక్టు అధికారులు జులై చివరి వారంలో



రెండవ టర్బైన్‌కు మరమ్మతులు చేస్తున్న ఇంజనీర్లు



ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలోని టర్బైన్లు

ప్రధాన విద్యుదుత్పాద కేంద్రంలో విద్యుదుత్పాదనను ప్రారంభించారు. అలాగే ఎడమ కాల్వకు నీటి విడుదల ప్రారంభంతో ఎడమ కాల్వపై గల విద్యుదుత్పాద కేంద్రంలో ఆగస్టు 2నుంచి విద్యుత్ ఉత్పాదన మొదలైంది. అయితే, ఎడమ కాల్వకు గండిపడటంతో చాలా రోజులు కాల్వకు నీటిని నిలిపివేశారు. ఈ అవాంతరం రాకుంటే.. ఇంకా ముందుగానే విద్యుత్ ఉత్పాదన లక్ష్యాన్ని చేరుకునే అవకాశముండేదని జెన్‌కో అధికారులు తెలిపారు.

రెండవ యూనిట్‌లో ముమ్మరంగా మరమ్మతులు

ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రంలో 8 యూనిట్లు ఉండగా రెండవ యూనిట్ రెండేళ్లుగా మరమ్మతులకు గురైంది. ఏడు యూనిట్లు మాత్రమే పనిచేస్తున్నాయి. దీనిని మరమ్మతు చేసేందుకు జపాన్ దేశం నుంచి సాంకేతిక నిపుణులు రావల్సిఉండగా సరైన సమయంలో వారు రాలేదు. వారం రోజుల క్రితం వారు సాగర్‌కు వచ్చారు. వారి సలహాలు, సూచనల మేరకు మరమ్మతుల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. త్వరలోనే మరమ్మతులు పూర్తి చేయనున్నట్లుగా అధికారులు తెలిపారు.



సాగర్‌లోని తెలంగాణ ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రం

సమష్టి కృషితో లక్ష్యాన్ని చేరాం



జులై రెండవ వారం నుంచి వరదలు మొదలు కావడంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు విద్యుదుత్పాదనను ప్రారంభించాం. పలు సమస్యలు ఎదురైనప్పటికీ వాటిని ఎదుర్కొంటూ ఉద్యోగుల సహకారంతో లక్ష్యాన్ని అధిగమించాం. త్వరలో రెండవ యూనిట్ మరమ్మతులు పూర్తి చేసి, 8 యూనిట్ల ద్వారా విద్యుదుత్పాదనను చేపడుతాం.

– మంగేష్‌కుమార్ నాయక్, జెన్‌కో సీఈ

అన్నను హత్య చేసిన తమ్ముడికి జీవిత ఖైదు

మిర్యాలగూడ టౌన్, హాలియా: అన్నను హత్య చేసిన కేసులో తమ్ముడికి జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ మంగళవారం మిర్యాలగూడ 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు తీర్పు వెలువరించారు. హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన అలుగుల వెంకట్‌రెడ్డి, అలుగుల చిన జంగారెడ్డి అన్నదమ్ములు. ఇరువురి మధ్య భూమి తగాదాలు నడుస్తుండడంతో 2018 జూన్ 12వ తేదీన పొలం వద్దకు వెళ్లిన అన్న వెంకట్‌రెడ్డిని తమ్ముడు చిన జంగారెడ్డి కత్తితో పొడవడంతో వెంకట్‌రెడ్డి మృతిచెందాడు. వెంకట్‌రెడ్డి భార్య కనకదుర్గ హాలియా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అప్పటి హాలియా ఎస్‌ఐ సతీష్ కేసు నమోదు చేయగా.. అప్పటి సీఐ ధనుంజయ మిర్యాలగూడ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా 19 మంది సాక్షులను విచారించిన అనంతరం చిన జంగారెడ్డిపై నేరం రుజువు కావడంతో అతడికి జీవిత ఖైదుతో పాటు రూ.5వేల జరిమానా విధిస్తూ 5వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జి. వేణు తీర్పు వెలువరించారు. జరిమాన చెల్లించకపోతే మరో మూడు నెలల పాటు జైలుశిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరమణారెడ్డి వాదించగా.. ఆయనకు లైజన్ ఆఫీసర్ చెరుపల్లి సైదులు, కోర్టు కానిస్టేబుల్ కుంచం వెంకన్న సహకరించారు.

కాపర్ వైరు చోరీ చేస్తున్న ముఠా అరెస్ట్

మునగాల: ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేస్తున్న ఐదుగురు ముఠా సభ్యులను మంగళవారం మునగాల పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో రిమాండ్ చేశారు. కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ముప్పారం గ్రామానికి చెందిన కొంచం కోటేష్, రూపాని గోపి, రూపాని నాగయ్య, వరికుప్పల శ్రీను, కుంచం విజయ్ ముఠాగా ఏర్పడి ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరు చోరీ చేస్తున్నారు. మంగళవారం విజయవాడ–కోదాడ జాతీయ రహదారిపై మునగాల మండలంలోని మొద్దులచెరువు గ్రామ స్టేజీ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. రెండు బైక్‌లపై వెళ్తున్న ఈ ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా.. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైరును చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. ఈ ముఠా నడిగూడెం, పెన్‌పహాడ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైరును చోరీ చేసినట్లు పేర్కొన్నారు. వీరి వద్ద



కాపర్ వైరును పరిశీలిస్తున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది

నుంచి 220 కేజీల కాపర్ వైరు, రెండు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిపై మిర్యాలగూడ, త్రిపురారం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఐదు కేసులు నమోదైనట్లు వివరించారు. ముఠాను పట్టుకున్న మునగాల ఎస్‌ఐ బి. ప్రవీణ్‌కుమార్, సిబ్బందిని సూర్యాపేట జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగంలో చేరిన 20 రోజులకే..

- ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ కండక్టర్

కనగల్: ఆర్టీసీ కండక్టర్‌గా ఉద్యోగంలో చేరిన 20 రోజులకే జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగి యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కనగల్ మండలం జీ.ఎడవెల్లి గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. జీ.ఎడవెల్లి గ్రామానికి చెందిన నీలకంఠం చక్రవర్తి(26) తండ్రి ఆర్టీసీలో కండక్టర్‌గా పనిచేసేవాడు. ఇటీవల వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్న ఆయన ఉద్యోగాన్ని కుమారుడు చక్రవర్తికి ఇప్పించాడు. 20 రోజుల క్రితం చక్రవర్తి యాదగిరిగుట్ట బస్ డిపోలో కండక్టర్‌గా ఉద్యోగం ప్రారంభించాడు. కండక్టర్ విధులకు కొత్త కావడంతో చక్రవర్తి ఇబ్బందులకు గురయ్యాడు. దీంతో సోమవారం సాయంత్రం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టుపక్కల రైతులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. మంగళవారం మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



చక్రవర్తి (ఫైల్)

విద్యుదాఘాతంతో రైతు మృతి

నల్లగొండ క్రైం: నల్లగొండ మండలంలోని ముశంపల్లి గ్రామానికి చెందిన రైతు మల్గిరెడ్డి శ్రీనివాసరెడ్డి(41) మంగళవారం వ్యవసాయ బావి వద్ద విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పొలాన్ని ట్రాక్టర్‌తో దున్నిన తర్వాత నాగలిని పొలం గట్టు వద్ద వదిలి మరో వైపునకు వెళ్తుండగా.. విద్యుత్ స్తంభం నుంచి మోటార్ స్టార్టర్‌కు లింక్ ఉన్న వైర్ తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ సంఘటన జరిగినా ఎవరూ గమనించలేదు. శ్రీనివాస్‌రెడ్డి ఇంకా భోజనానికి రాలేదని ఆయన కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. మృతునికి భార్య అనిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్‌ఐ సైదాబాబా తెలిపారు.



శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

మార్బుల్ బండలకు పాలిష్ పడుతూ..

కోదాడరూరల్ : మార్బుల్ బండలకు పాలిష్ పడుతూ విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన కోదాడ మండలం నల్ల బండగూడెంలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండలం గణపవరం గ్రామానికి చెందిన భూక్యా శ్రీను(45) మారుబల్ బండలకు పాలిష్ పడుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం నల్లబండగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ ఇంట్లో బండలకు పాలిష్ పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు గమనించి పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. మృతుడి భార్య సోని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపారు.

కొడుకులు సాకడం లేదని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



విలపిస్తున్న లక్ష్మమ్మ

మిర్యాలగూడ: కన్న కొడుకులు తనను సాకడం లేదని ఓ తల్లి మంగళవారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్‌కు ఫిర్యాదు చేసింది. దామరచర్ల మండలం కొండ్రపోల్ గ్రామానికి చెందిన సాడోజు లక్ష్మమ్మ తన ఇద్దరు కుమారులు నరసింహాచారి, వినోద్‌చారి తన బాగోగులు చూడకుండా ఇంటి నుంచి తరిమివేశారని సబ్ కలెక్టర్ కార్యాలయానికి వచ్చి ఆయనకు తన ఆవేదనను తెలియజేసింది. తన కుమారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని ఆమె సబ్ కలెక్టర్‌ను కోరింది. కుమారులను పిలిపించి తగు న్యాయం చేస్తామని సబ్ కలెక్టర్ అమిత్ నారాయణ్ ఆమెకు హామీ ఇచ్చారు. అప్పటివరకు వృద్ధురాలిని అవంతీపురం అనాథశ్రమానికి తరలించారు.

కంప్యూటర్ ఆపరేటర్‌కు బెయిల్ మంజూరు

హుజూర్‌నగర్: ప్రభుత్వ భూములను అక్రమంగా ఇతరుల పేరిట పట్టా చేసి రైతుబంధు స్వాహా చేసిన కేసులో అరెస్టై హుజూర్‌నగర్ జైలులో ఉన్న కంప్యూటర్ ఆపరేటర్ జగదీష్‌కు బెయిల్ మంజూరైంది. హుజుర్‌నగర్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.10వేల పూచీకత్తు, ఇద్దరు వ్యక్తుల జామీను, ప్రతి శనివారం దర్యాప్తు అధికారి ఎదుట హాజరు కావాలని, పోలీసుల దర్యాప్తునకు సహకరించాలని, సాక్షులను ప్రభావితం చేయకూడదనే షరతులతో బెయిల్ మంజూరు చేశారు. దీంతో జగదీష్ హుజుర్‌నగర్ సబ్ జైలు నుంచి మంగళవారం విడుదలయ్యాడు. ఇదే కేసులో అరెస్టై జైలులో ఉన్న గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన జయశ్రీకి బెయిల్ లభించలేదు. ఆమె తరఫున హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేసిన హైకోర్టు ఈ నెల 25వ తేదీకి వాయిదా వేసినట్లు సమాచారం.

రెండు గేట్ల ద్వారా మూసీ నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు నుంచి దిగువకు వెళ్తున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం ప్రాజెక్టుకు 1227 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. అధికారులు రెండు క్రస్ట్ గేట్లను పైకెత్తి 977 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 643.85 అడుగుల మేర నీరు ఉంది. ఎడమ కాల్వ ద్వారా 48 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 41 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది. విడుదల చేశారు. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.16 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ ఉదయ్ తెలిపారు.

పులిచింతల ప్రాజెక్టు గేట్లు మూసివేత

హుజూర్‌నగర్: పులిచింతల ప్రాజెక్టుకు వస్తున్న వరద ఉధృతి తగ్గింది. దీంతో మంగళవారం ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. ఇన్‌ఫ్లో 71,923 క్యూసెక్కులు వస్తుండగా విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 16వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 45.77 టీఎంసీలు కాగా ప్రస్తుతం 43.01 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టులో అంతర్భాగంగా నిర్మించిన తెలంగాణ జెన్‌కోలో మంగళవారం 100 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది.

చదువుకున్న బడిలోనే ప్రధానోపాధ్యాయుడిగా..



కొత్త మహదేవరెడ్డి

ఆత్మకూరు(ఎం): గతంలో తాను చదువుకున్న పాఠశాలలోనే ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన కొత్త మహదేవరెడ్డి. ఆత్మకూరు(ఎం) జెడ్పీహెచ్‌ఎస్‌లో 1975–76లో మహదేవరెడ్డి ఆరో తరగతి చదువుకున్నాడు. ఆ తర్వాత ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించిన ఆయన ఆత్మకూరు(ఎం) జెడ్పీహెచ్‌ఎస్‌లోనే 1996 నుంచి 2000 వరకు ఎస్జీటీగా, అదే పాఠశాలలో 2000 నుంచి 2005 వరకు స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేసి బదిలీ అయ్యారు. అనంతరం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పనిచేసిన ఆయన ఇటీవల పదోన్నతిపై గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడుగా తిరిగి ఆత్మకూరు(ఎం) జెడ్పీహెచ్‌ఎస్‌కే వచ్చారు. ఒకప్పుడు తాను చదువుకున్న పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


విద్యార్థులు సవాళ్లను స్వీకరించాలి

- మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ రూరల్: విద్యార్థులు సమాజంలో ఎదురవుతున్న సవాళ్లను స్వీకరించి వాటిని పరిష్కరించే మార్గాలను అన్వేషించాలని మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో నిర్వహించిన జాతీయ సైన్స్ దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి సమస్యకు ఒక పరిష్కారం ఉంటుందని దానిని కనుగొనేందుకు పరిశోధనలు చేస్తేనే సత్ఫలితాలు వస్తాయన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్, హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ చల్లా సురేష్ మాట్లాడుతూ.. మారుతున్న ఆహార అలవాట్లు, పని విధానం, సామాజిక పోకడలు, జీవన ప్రక్రియ అనేక రుగ్మతలకు ప్రధాన కారణాలన్నారు. వీటిని పరిష్కరించేందుకు విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవి, ఓఎస్‌డీ అంజిరెడ్డి, మద్దిలేటి, శివరాం, మాదూరి, రామచందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు పోటీతత్వాన్ని పెంపొందిస్తాయి..

క్రీడలు విద్యార్థుల్లో పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. తైక్వాండో పోటీలో అంతర్‌యూనివర్సిటీకి ప్రాతినిధ్యం వహిస్తున్న బాలబాలికల జట్లను మంగళవారం యూనివర్సిటీలో ఆయన అభినందించారు. పంజాబ్ రాష్ట్రంలోని అమృత్‌సర్‌లో గల గురునానక్ దేవి విశ్వవిద్యాలయంలో నవంబర్ 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు బాలురకు, 12వ తేదీ నుంచి 15వ తేదీ వరకు బాలికలకు పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా, యూనివర్సిటీకి క్రీడల ద్వారా మంచి గుర్తింపు తేవాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రవి, స్పోర్ట్స్ కార్యదర్శి హరీష్‌కుమార్, మురళి, శ్రీనివాస్‌రెడ్డి, రెడ్యానాయక్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైస్ చాన్స్‌లర్ అల్తాఫ్ హుస్సేన్

సాంకేతికను అందిపుచ్చుకుని పరిశోధనలు చేయాలి

సాంకేతికతను అందిపుచ్చుకుని సరైన పరిశోధనలు చేస్తేనే సమాజానికి ఉపయోగపడే ఫలితాలు వస్తాయని ఎంజీయూ వీసీ అల్తాఫ్ హుస్సేన్ అన్నారు. పరిశోధనా పద్ధతులపై డిసెంబర్ 12వ తేదీ నుంచి 22వ తేదీ వరకు యూనివర్సిటీలో జరగనున్న శిక్షణ తరగతులకు సంబంధించిన కరపత్రాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా యూజీసీ గుర్తింపు పొందిన సంస్థల్లోని యువ అధ్యాపకులు, పరిశోధకులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఎన్ఐటీ, సెంట్రల్ యూనివర్సిటీల్లో నిష్ణాతులైన అధ్యాపకులు శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు మిర్యాల రమేష్, సరిత, ఎంవీఎస్ రెడ్డి, శ్రీలక్ష్మి, సురేష్‌రెడ్డి, ప్రవళ్లిక, లక్ష్మిప్రభ, సబీనా హెరాల్డ్ పాల్గొన్నారు.

మద్యం అమ్మితే రూ.25 వేలు జరిమానా

- తీర్మానం చేసిన పిల్లిగుండ్ల తండావాసులు

బొమ్మలరామారం: మండలంలోని పిల్లిగుండ్ల తండాలో మద్యాన్ని నిషేధిస్తూ మంగళవారం తండావాసులు తీర్మానం చేశారు. ఈ మేరకు గ్రామ పంచాయతీ ఆవరణలో సమావేశమైన గిరిజనులు తండాలోని 8 బెల్ట్ షాపుల్లో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం అందుబాటులో ఉండడంతో మద్యానికి బానిసలుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎవరైనా గ్రామస్తుల తీర్మానానికి విరుద్ధంగా మద్యం అమ్మితే ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు రూ.25వేల జరిమానా విధిస్తామని, మద్యం అమ్మినవారి వివరాలు తెలిపిన వారికి గ్రామ పంచాయతీ నుంచి బహుమతి అందజేస్తామన్నారు. ఈ మేరకు గ్రామస్తులు గ్రామ ప్రత్యేకాధికారి శ్రీ మాలిని, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ సమక్షంలో తీర్మానం చేశారు. తండావాసుల నిర్ణయాన్ని పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతిస్తూ అభినందనలు తెలిపారు.



తీర్మాన ప్రతిని చూపుతున్న పిల్లిగుండ్ల తండా యువకులు

ఆడశిశువును అక్రమంగా దత్తత ఇచ్చిన తల్లిదండ్రులు

- శిశువును డీసీపీఓకు తరలించిన బాలల సంరక్షణ అధికారులు

యాదగిరిగుట్ట: తుర్కపల్లి మండలంలోని ఓ గ్రామానికి చెందిన దంపతులు తమ ఆడశిశువును అక్రమంగా దత్తత ఇచ్చిన విషయం మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సదరు దంపతులకు ఇటీవల మూడో కాన్పులోనూ కుమార్తె పుట్టింది. పుట్టిన నాటి నుంచి పాపను గ్రామానికి తీసుకురాలేదు. ఇదే విషయమై అంగన్‌వాడీ టీచర్ ఆ దంపతులను అడగగా తమ బంధువుల వద్ద ఉందని పొంతనలేని సమాధానాలు చెప్పారు. దీంతో అంగన్‌వాడీ టీచర్ జిల్లా శిశు సంక్షేమ, బాలల సంరక్షణ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చింది. బాలల సంరక్షణ అధికారులు వెంటనే గ్రామానికి చేరుకుని సదరు దంపతులను పుట్టిన పాప ఎక్కడ ఉందని అడగగా.. తమ బంధువుల వద్ద ఉందని సమాధానమిచ్చారు. బంధువులు ఎక్కడ ఉంటారు.. వారి వద్దకు వెళ్లి పాపను చూద్దామని అధికారులు ప్రశ్నించగా.. తమకు ముగ్గురు ఆడపిల్లలు పుట్టారని, ఆర్థిక స్థోమత బాగోలేకపోవడంతో మూడో సంతానమైన ఆడపిల్లను ఒకరికి దత్తత ఇచ్చామని చెప్పారు. దీంతో దత్తత తీసుకున్న వారి వద్ద నుంచి శిశువును అధికారులు డీసీపీఓ కార్యాలయానికి తీసుకువచ్చారు. ఈ ఘటనపై జిల్లా అధికారి సైదులును వివరణ అడగగా.. దత్తతకు సంబంధించిన అంశం తమ దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల ఆదేశాలతో శిశువును శిశు గృహంలో అప్పగించామన్నారు. ఈ ఘటనపై బుధవారం పూర్తి విచారణ చేపట్టనున్నట్లు చెప్పారు.

తెలంగాణలో అద్భుత పర్యాటక ప్రాంతాలున్నాయి

- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

నాగార్జునసాగర్: తెలంగాణలో అద్భుతమైన పర్యాటక ప్రాంతాలున్నాయని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ కితాబిచ్చారు. ఉత్తరప్రదేశ్ రాజధాని పాట్నాలో జరుగుతున్న ట్రావెల్ ట్రేడ్ ఫేర్‌లో తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్‌ను మంగళవారం కేంద్ర మంత్రి ప్రారంభించినట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి చెప్పారు. బుద్ధవనం, రామప్ప దేవాలయం, గోల్కొండ కోట ఛాయా చిత్రాలతో ఏర్పాటు చేసిన స్టాల్‌ను కేంద్ర మంత్రి తిలకించి తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక స్థావరంగా అభివృద్ధి చేయడానికి తగు సహకారాన్ని అందిస్తామని అన్నారని పటేల్ రమేశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుద్ధవనం ప్రత్యేకతల గురించి బుద్ధవనం కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి కేంద్ర మంత్రికి వివరించారు. బుద్ధవనాన్ని సందర్శించాలని కేంద్ర మంత్రిని ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారని పటేల్ రమేశ్‌రెడ్డి తెలిపారు.




పాట్నాలో బుద్ధవనం స్టాల్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్

నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తగ్గిన వరద

- రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్: ఎగువ నుంచి నాగార్జునసాగర్ జలాశయానికి వస్తున్న వరద తగ్గింది. మంగళవారం రెండు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్టస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 588 అడుగులు మేర నీరు ఉంది. ఎగువ నుండి 71,361 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా 64,518 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 15,948 క్యూసెక్కులు, ప్రధాన విద్యుదుత్పాదన కేంద్రానికి 29,557 క్యూసెక్కులు, కుడి, ఎడమ, ఏఎమ్మార్పీ, వరద కాల్వలకు 19,196 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.



రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు